సాక్షి
ప్రకాశం
గురువారం । 28 । నవంబర్ । 2024





### ప్రతిపక్షం గొంతునొక్కేందుకు కూటమి సర్కారు పన్నాగం

ప్రతిపక్షం గొంతునొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చుండూరి రవి అన్నారు. - 8లో..



### ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలి

ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. - 8లో..

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
31/22

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

## న్యూస్‌రీల్

### మహిళలకు కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

**ఒంగోలు వన్‌టౌన్:** రూడ్ సెట్ ఆధ్వర్యంలో మహిళలకు కారు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 7 నుంచి జనవరి 5వ తేదీ వరకు 30 రోజుల పాటు ఒంగోలులోని రూడ్ సెట్ శిక్షణ సంస్థలో ఈ శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 9573363141 నంబరుపై సంప్రదించాలన్నారు.

### జియోట్యాగింగ్ సర్వే పూర్తి చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న చిరంజీవి

**కొత్తపట్నం:** మండలంలో ఎన్‌పీసీఐ, జియోట్యాగింగ్ సర్వే పూర్తి చేయాలని జిల్లా ప్రజా పరిషత్ కార్యనిర్వహణాధికారి బి.చిరంజీవి ఆదేశించారు. బుధవారం కొత్తపట్నం-1 సచివాలయం, గుండమాల సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెలాఖరుకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జియో ట్యాగింగ్ చేయాలని, కుటుంబ యజమాని పేరుతో బ్యాంక్ అకౌంట్ లేకుంటే ఓపెన్ చేయించాలని సూచించారు. 17 వేల మందిని యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 12 వేల మందికి చేయడం జరిగిందన్నారు. మిగతా 5 వేల మంది నమోదును ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గుండమాల గ్రామంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. ఆధార్‌లో మార్పులు చేసుకోవచ్చన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీకృష్ణతో మాట్లాడుతూ ఇవన్నీ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు.


# ధర ఎరుపెక్కేనా..

రెండేళ్లుగా మంచి ధరలతో రైతుకు మిర్చి పంట లాభాలు తెచ్చిపెట్టింది. గత నెలలో కురిసిన వర్షాలకు రైతులు కొంత మేర నష్టపోయినా దిగుబడులు, ధరలపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 55,823 ఎకరాల్లో సాగు చేశారు. అధిక దిగుబడినిచ్చే రకాలను ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. గత సీజన్ ధరలతో పోల్చుకుంటే ఈసారి కూడా రైతుల పంట పండినట్లే.

- ఎర్ర బంగారంపై ఆశలు
- రెండేళ్లుగా జిల్లా మిర్చి రైతులకు లాభాలు
- జిల్లాలో 55,823 ఎకరాల్లో సాగు
- పశ్చిమ ప్రకాశంలో అత్యధికంగా సాగు
- తెగుళ్లపై రైతులు అప్రమత్తం
- ప్రస్తుతం మార్కెట్లోకి పచ్చిమిర్చి



సాగవుతున్న మిర్చి




మార్కాపురం:

జిల్లాలోని మిరప రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రెండేళ్లుగా లాభాలు తెచ్చిపెట్టిన మిర్చి సాగుపై రైతులు ఆసక్తి చూపించారు. జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం 75 వేల ఎకరాలు కాగా, ప్రస్తుతం 55,823 ఎకరాల్లో సాగు చేశారు. గత సీజన్‌లో సాధారణ విస్తీర్ణం కంటే అదనంగా 20 వేల ఎకరాలు.. అంటే 95 వేల ఎకరాల్లో పండించారు. మార్కాపురం యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో పండిస్తున్నారు.

ముఖ్యంగా రైతులు అధిక దిగుబడులు ఇచ్చే యూఎస్ 341, నంబర్ 5, 5831 తేజలో పలు రకాలు సాగుచేశారు. ఎకరాకు సుమారు రూ.25 నుంచి రూ.30 వేల వరకూ ఖర్చుపెట్టారు. ఎకరాకు సుమారు 10 వేల మొక్కలు నాటారు. కొంత మంది బోర్లకింద కూడా మిర్చి సాగుచేశారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకూ దిగుబడులు రావచ్చని రైతులు భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చి వరకు గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి అమ్మకాలు బాగా సాగాయి. క్వింటా రూ.14 నుంచి రూ.16 వేల వరకు ధర పలికింది. ఈ లెక్కన రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. జిల్లాలో పశ్చిమ ప్రకాశంలోనే అత్యధికంగా మిర్చి సాగవుతోంది. డివిజన్ మొత్తం మీద గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు సబ్‌డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో సుమారు 41,871 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఇప్పటికే మార్కెట్‌లోకి పచ్చిమిర్చి వచ్చింది. రెండు మూడు వారాల తర్వాత ఎండుమిర్చి మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది.

### వర్షాలకు రూ.3 కోట్ల మేర నష్టం

వాయుగుండం ప్రభావంతో గత నెలలో కురిసిన భారీ వర్షాల ప్రభావం మిర్చి సాగుపై చూపించింది. జిల్లాలో దాదాపు రూ.3 కోట్ల మేర మిర్చి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికార యంత్రాంగం లెక్కలు చెబుతున్నాయి. ప్రధానంగా కురిచేడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపూడి, రాచర్ల, అర్థవీడు, బేస్తవారిపేట, కనిగిరి తదితర మండలాల్లో దాదాపు 11 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. పూత దశలోనే దెబ్బతినడంతో మళ్లీ నారు వేసి సాగుచేస్తున్నారు.

**తెగుళ్లపై అధికారుల సూచనలు...**

ప్రస్తుతం జిల్లాలో సాగవుతున్న మిర్చిలో అక్కడక్కడా కొమ్మ ఎండు, కాయకుళ్లు తెగులు కనిపిస్తోంది. రైతులు ఈ తెగులు సోకిన చెట్టు ప్రతి భాగాన్ని టెబుకొనజోల్ ఒక మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మబ్బులతో కూడిన వాతావరణం, గాలిలో అధిక తేమశాతం ఉన్న ప్రాంతాల్లో కానోఫొరాబ్‌లెట్ తెగులు వస్తుంది. ఇది కాండం కుళ్లేలా చేస్తుంది. నివారణకు పైరాక్లోస్టెబిన్, మేటీరామ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తామరపురుగు సోకినట్లయితే ఇది రసం పీల్చుతుంది. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఆకులు ఎర్రగా మారడం, చెట్టు పెరుగుదల తగ్గుతుంది. నివారణకు ఎసిటామీప్రిడ్ 0.2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**నర్సరీలు ఇలా...**

జిల్లాలో మొత్తం 205 నర్సరీలు ఉండగా పశ్చిమ ప్రకాశంలోనే 160 నర్సరీలు ఉన్నాయి. ఇందులో బేస్తవారిపేటలో 25, కొమరోలులో 27, మార్కాపురంలో 6, పుల్లలచెరువులో 15, పెద్దారవీడులో 20, త్రిపురాంతకంలో 19, యర్రగొండపాలెంలో 9, గిద్దలూరులో 13, కంభం 3, దర్శిలో 6 నర్సరీలు, కొనకనమిట్లలో 10 నర్సరీలు ఉన్నాయి. రైతులకు పెద్ద మొత్తంలో మిరప నారు అందించారు. జిల్లాలో ఎక్కువగా తేజ, ఆర్మూరు, బ్యాడీ, జీని 26 26, 341 రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు 12 వేల నుంచి 14 వేల మొక్కలు నాటుతున్నారు. రకాన్ని బట్టి మొక్క రూ.1.50 నుంచి రూ.2 వరకు కొనుగోలు చేస్తున్నారు.

**జిల్లాలో సాగు ఇలా...**

| మండలం | ఖరీఫ్ సాగు (ఎకరాల్లో) |
|---|---|
| మార్కాపురం | 2657.52 |
| దోర్నాల | 5817.10 |
| పెద్దారవీడు | 4543.83 |
| వై.పాలెం | 10409.49 |
| త్రిపురాంతకం | 5767.35 |
| పుల్లలచెరువు | 8098.75 |
| గిద్దలూరు | 893.33 |
| రాచర్ల | 1086 |
| బేస్తవారిపేట | 910.59 |
| అర్థవీడు | 2207.97 |
| తర్లుపాడు | 1520.42 |
| దొనకొండ | 1386.30 |
| కురిచేడు | 2078.14 |
| ముండ్లమూరు | 2552.10 |
| దర్శి | 1331.42 |
| కొనకనమిట్ల | 765.01 |
| పొదిలి | 641.69 |
| తాళ్లూరు | 259.02 |
| నాగులుప్పలపాడు | 510.21 |
| మద్దిపూడి | 676.82 |

**తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి**



మిర్చి రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నాం. వాతావరణ మార్పుల ఆధారంగా వచ్చే తెగుళ్ల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. కొమ్మ ఎండు, కాయకుళ్లు తెగులు కనిపిస్తోంది. ఇది కాండం కుళ్లేలా చేస్తుంది. సకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నాం. అలాగే తామరపురుగుపై కూడా అప్రమత్తంగా ఉండాలి.

– గోపీచంద్, హార్టికల్చర్ ఏడీ, ఒంగోలు

# ఆరు నెలల్లోనే పిల్లిమొగ్గలు

- అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం ఫెయిల్
- ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు
- బాధితురాలిని పరామర్శిస్తే 11 కేసులు పెట్టారు
- నేను ప్రజల మధ్యలోనే ఉంటా.. అరెస్ట్ చేసుకోండి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన కారుమూరి నాగేశ్వరరావు, శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

**దర్శి:** కేంద్రంలో అధికారం ఉండి కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయలేక ఆరు నెలల్లో చంద్రబాబు పిల్లి మొగ్గలు వేస్తున్నారని ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మాట తప్పని మడమ తిప్పని ఒకే ఒక్క సీఎంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో నిలిచారని చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకులుతో సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంట్ పరిశీలకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో ఎటువంటి పొత్తులు లేకుండానే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలించారని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఉదయం గ్రామాల్లో ప్రోగ్రాంకు వెళ్లాలంటే ఎక్కడ హామీలు అడుగుతారో అని మధ్యాహ్నం వెళ్లి వెంటనే వెనుదిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నీరు గార్చిందన్నారు. బ్రిటీష్ పాలనకంటే ఈ కూటమి పాలన దుర్మార్గంగా ఉందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాలేదని ఈవీఎంలు వారిని గెలిపించాయని ఎద్దేవా చేశారు. ఈవీఎం సీఎం చంద్రబాబు, ఈవీఎం ఎమ్మెల్యేలు, మంత్రులను హామీలపై ప్రశ్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మళ్లీ మనం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అరాచకాలు మీరు కూడా చేయాలని మనకు కూడా నేర్పుతున్నారన్నారు. పిల్లిని గదిలో వేసి కొడితే పులిలా తిరగబడుతుందని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా కూడా అంతేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్నీ అరాచకాలే రాజ్యమేలుతున్నాయని అంతకు అంత అనుభవిస్తారని హెచ్చరించారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం అని చెప్పారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఎంతో కష్టపడి గెలిపించారన్నారు. మళ్లీ జరిగే ఎన్నికల్లో మరింత మెజార్టీతో గెలిపించుకునేలా గతంలో కంటే ఇంకా కష్టపడి పార్టీని బలోపేతం చేయాలన్నారు. జగనన్న సీఎంగా ఉన్నప్పుడు అన్నీ పథకాలు అమలు చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు కూటమి అధికారంలోకి వచ్చి ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదన్నారు. రైతులకు రూ.20 వేలు, అమ్మకు వందనంకు రూ.15 వేలు, మహిళలకు రూ.15 వేలు ఇంకా ఎన్నో పథకాలు ఇస్తామని హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబం పై ప్రేమతో తనను ఎమ్మెల్యే చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదన్నారు. గతంలో బొట్లపాలెం ఘటనలో నిరసన తెలపాలని కోరితే కార్యకర్తలు భారీగా స్పందించారని చెప్పారు. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పై అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. ఇటీవల మహిళలపై అత్యాచారాలు ఎన్నో జరిగాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి ఆ హామీ అమలు చేయలేదన్నారు. ఉచిత ఇసుక గాలికి వదిలేశారన్నారు. ఉచితం పేరుతో టీడీపీ నాయకులు అడ్డగోలుగా ఇసుకను దోచుకుతింటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజులు ఉంటారని, ప్రతి కార్యకర్తతో మాట్లాడి వారి సాధక బాధలు తెలుసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకట సుబ్బారెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, రాష్ట సంయుక్త కార్యదర్శి మాజీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, కొరివి మునలయ్య, మాజీ మండల కన్వీనర్లు కాకర్ల కృష్ణారెడ్డి, సూదిదేవర అంజయ్య, కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్ బాబు, తుళ్లూరి బాబురావు, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, బట్టు రాము, సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌లు కేవీరెడ్డి, షేక్ షకీలా అమీన్ బాషా, మాజీ జేసీఎస్ కన్వీనర్‌లు మేడికొండ జయంతి, బత్తినేని వెంకటేశ్వర్లు, గుంటు పోలయ్య, మాజీ సర్పంచ్‌లు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు ఐవీ సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, కోరే సుబ్బారావు, నాగలక్ష్మి, పీట్ల నాగేశ్వరరావు, అన్నెం చిరంజీవి, మజ్జువలి, అన్నవరపు రవి, జోసఫ్, రమణారెడ్డి, గోను నారాయణరెడ్డి, గోను వెంగళరెడ్డి, ఆంజనేయరెడ్డి, పిచ్చిరెడ్డి, కొడవటి జాన్, గర్నెపూడి సామ్యేల్, పానుగంటి కోటయ్య, గొంది అప్పిరెడ్డి, నరసింహారెడ్డి, వలి, గోగులమూడి లింగారెడ్డి, వెంకటరెడ్డి, అంజిరెడ్డి, వలి, ఖాశీం, వెంకటేశ్వరరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, డగ్లస్, మరమల మధు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### పరామర్శించడానికి వెళ్తే కేసులు పెట్టారు..

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో దాడికి గురైన బాధిత బాలికను పరామర్శించేందుకు వెళితే పోలీసులు తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీతో సహా 11 సెక్షన్లతో కేసు నమోదు చేశారన్నారని ఆరోపించారు. బాలిక తండ్రి తనకు ఫోన్ చేసి జరిగిన అన్యాయం గురించి చెప్పి అండగా నిలవాలని కోరితే తాను రాత్రి 9 గంటల సమయంలో 80 కిలోమీటర్ల దూరం వెళ్లి పలకరించి ధైర్యం చెప్పి తిరుపతి ఆస్పత్రికి తీసుకొచ్చి మెరుగైన వైద్యం చేయించామని తెలిపారు. ఎక్కడా బాలిక గురించి ప్రస్తావన కూడా తీసుకురాలేదని చెప్పారు. భయపెట్టి కేసులు పెట్టి లొంగతీసుకోవాలనుకుంటున్నారని అలా భయపడేవారం కాదని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు తన పై 88 కేసులు పెట్టి నెలల తరబడి జైలులో ఉంచారని ఆరోపించారు. జిల్లాలు తిప్పి తనను కొట్టి హింసించారని చెప్పారు. తాను ముందస్తు బెయిల్ కూడా తెచ్చుకోనని ఎప్పుడూ జనంలోనే జనంతోనే ఉంటానని స్పష్టం చేశారు. కావాలంటే అరెస్ట్ కూడా చేసుకోవచ్చన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యేలకంటే ఎంపీ అభ్యర్థి అయిన తనకు 52 వేల ఓట్లు అధికంగా వచ్చాయని చెప్పారు. తనపై అభిమానం చూపిన నాయకులు, కార్యకర్తలు అభిమానులకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తాను బూచేపల్లి కుటుంబ సభ్యుడనేనని, నా తమ్ముడు శివప్రసాద్‌రెడ్డి తో కలసి జిల్లాలో అన్నీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు కానుకగా ఇస్తామని హామీ ఇచ్చారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు



కారుమూరిని సత్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

## ఆస్తుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ సీఈఓ చిరంజీవి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

**ఒంగోలు సిటీ:** జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్ ఆస్తుల భద్రత, రికార్డుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న పరిపాలనాధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ ఇయర్ మార్క్‌డ్ ఫండ్స్, లోకల్ ఫండ్, అకౌంటెంట్ జనరల్ ఆడిట్ అభ్యంతరాలు, ఎంపీపీ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, బడ్జెట్ తయారీ సాంవత్సరిక లెక్కలు, యాన్యువల్ అడ్మినిస్ట్రేషవ్ రిపోర్టు జెడ్పీ కార్యాలయానికి పంపేందుకు, పంచాయతీరాజ్ శాఖ ప్రాముఖ్యత అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సహాయ ఆడిట్ అధికారి కె.రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో నిల్వ ఉన్న ఆడిట్ అభ్యంతరాలు ఏ విధంగా డ్రాప్ చేసుకునేందుకు విధి విధానాలు, జీఎస్టీ, ఐటీ ప్రభుత్వానికి ఎలా జమచేయాలో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ పి.బాలమ్మ, పరిపాలనాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్యారమ్స్ జిల్లాస్థాయి క్రీడాకారులు వీరే



క్యారమ్స్ జిల్లా జట్లు

**ఒంగోలు:** క్యారమ్స్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక స్థానిక భాగ్యనగర్‌లోని బొమ్మరిల్లు హోంలో నిర్వహించినట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ హజీరాబేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 బాలబాలికలు, అండర్ 17, అండర్ 19 బాలబాలికల విభాగంలో ఎంపికైన వీరు త్వరలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు.

**అండర్ 14 బాలికలు:**
కె.సోని, బి.వెంకటేశ్వరమ్మ, బి.సాయి జస్మిత, బి.కావ్య, కె.గోవిందమ్మ, జి.హాసిని

**అండర్ 14 బాలురు:**
జె.రాజేష్, వి.జీవన్‌కుమార్, ఎన్‌వీ హృషికర్, పి.రిత్విక్, ఎ.పృథ్వి, కె.ధీరజ్

**అండర్ 17 బాలికలు:**
జె.గంగోత్రి, ఎస్‌కె మొబీనా, సీహెచ్ ఝాన్సీ, కె.ఆగ్నేయ, ఎం.రిషిత జాయ్, టి.లేఖన

**అండర్ 17 బాలురు:**
కె.సాయికుమార్, కె.చందు, కె.సిద్ధు , సీహెచ్ అభిలాష్, జి.గౌతమ్, జి.పార్థు,

**అండర్ 19 బాలికలు:**
ఎ.దేవీప్రియ, కె.కీర్తిచందన, జి.కృతిక శివ, వి.పూర్ణ నక్షత్ర, ఎ.హిమవర్థిని, కె.చక్రిక

**అండర్ 19 బాలురు:**
పి.పవన్‌కుమార్, ఎస్‌కె మస్తాన్, డి.సాయిరెడ్డి, ఎల్.రుషిదీప్, పి.సందీప్, ఇ.జస్వంత్, టి.అశోక్

## 30న జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక

**ఒంగోలు:** జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈనెల 30న స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ తైక్వాండో కోచ్, జాతీయ చాంపియన్ షేక్ కరిముల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 27 నుంచి వరకు ఉత్తరప్రదేశ్‌లోని కుషినగర్‌లో జరిగే జాతీయ తైక్వాండో పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే జాతీయ తైక్వాండో అధ్యక్షుడు బీవీ రమణయ్య జాతీయ తైక్వాండో షెడ్యూలును కూడా ప్రకటించినందున తైక్వాండో క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు షేక్ ఆరిఫ్, సెల్ నెంబర్ 8886661606ను సంప్రదించాలన్నారు.

## నేడు మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి

**ఒంగోలు వన్‌టౌన్:** మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి యం.అంజల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### పెద్దపులి దాడిలో ఎద్దు మృతి



చనిపోయిన ఎద్దును పంచనామా చేస్తున్న అధికారులు

**అర్ధవీడు:** మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్ద పులి దాడి చేసిన ఘటన మండలంలోని వెలగలపాయ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చెల్లె వెంక ట్రావుకు చెందిన ఎద్దు మేతకు వెళ్లి తిరిగి రాక పోవడంతో అటవీ ప్రాంతంలో వెతుకుతుండగా పెద్దపులి దాడి చేసి చంపేసినట్లు గుర్తించారు. బీట్ గార్డ్ అబ్దుల్ గఫార్, పశు వైద్యాధికారి రాజేశ్ చనిపోయిన ఎద్దుకు పోస్టుమార్టం చేశారు. రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని అధికారులు తెలిపారు.

### హోంగార్డు సతీమణికి కారుణ్య నియామకం



కారుణ్య నియామకాన్ని అందజేస్తున్న ఎస్పీ దామోదర్

**ఒంగోలు టౌన్:** మార్కాపురం డివిజన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది మే 5న మరణించిన హోంగార్డు పి. శ్రీను సతీమణి పి. కాశమ్మకు ఎస్పీ ఏఆర్ దామోదర్ కారుణ్య నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నియామక పత్రాన్ని అందజేసిన ఎస్పీ.. కుటుంబసభ్యుల వివరాలు, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలని, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి పోలీసు శాఖలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. మరణించిన పోలీసు, హోంగార్డు కుటుంబసభ్యులకు అండగా ఉంటామని చెప్పారు. ఆర్ సీతారామిరెడ్డి, హోంగార్డు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### మహిళ హత్యపై పోలీసుల విచారణ

**టంగుటూరు:** టంగుటూరు వాణీనగర్‌లో మహిళ హత్యపై పోలీసులు ముమ్మర విచారణ సాగిస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం హైమావతి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావులు హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను బుధవారం స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అదే విధంగా ఘటన జరిగిన ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు, ఫోన్ల రికార్డులు పరిశీలించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

**చీమకుర్తి:** కుటుంబ కలహాల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు పద్మచరణ్ శెట్టి(34) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొట్టకూటి కోసం ఒడిశా నుంచి వలస వచ్చిన పద్మచరణ్ చీమకుర్తి రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి భార్యతో జరిగిన గొడవ వల్ల మనస్థాపానికి గురై అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

## ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు
# కూటమి సర్కారు పన్నాగం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై కేసును ఖండించిన ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవి
- బాధితులను పరామర్శిస్తే కేసులు నమోదు చేయడం ఎక్కడా చూడలేదని ధ్వజం
- దళిత కుటుంబాన్ని అడ్డుపెట్టి కేసుల నమోదు సిగ్గుచేటన్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్
- బాధిత కుటుంబాలను పరామర్శించకూడదని బీఎన్ఎస్ చట్టంలో ఉందా అని ప్రశ్న



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవి. పక్కన కఠారి శంకర్, లీగల్ సెల్ నాయకులు

**ఒంగోలు టౌన్:**

మనవరాలి వయసు కలిగిన బాలికను పరామర్శించి, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మీద పోక్సో కేసు పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి విమర్శించారు. బుధవారం జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు నోరెత్తకుండా కూటమి ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బాధిత బాలిక తండ్రి కంటే పెద్ద వయసు కలిగిన చెవిరెడ్డి మీద కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి చోద్యాన్ని మరెక్కడా చూడలేదని చెప్పారు. రాష్ట్రంలో ఏమి జరిగినా ప్రతిపక్షాలు ఎవరినీ పరామర్శించకూడదని, ధైర్యం చెప్పకూడదని, సహాయం చేయకూడదని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఉందన్నారు. తప్పుడు సెక్షన్లు పెడితే ప్రజా నాయకుడి ప్రతిష్ట దిగజారదని, ప్రభుత్వ చర్యలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం మానేసి ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు, మాజీ స్పెషల్ పీపీ నగరికంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చంద్రగిరి మండలం ఎర్రవారిపాలెం గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికను కొందరు యువకులు బలవంతంగా ఎత్తుకెళ్లిన ఘటనపై స్వయంగా బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ముసుగు ధరించి వచ్చిన యువకులు తన కూతురిపై కత్తితో దాడి చేశారని, నీళ్లలో మత్తు మందు కలిపి తాగించారని, చేయి, పొట్టపై కత్తితో కోసి ముళ్లపొదల్లో పడేశారని ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు. ఈ సమాచారం తెలిసి చలించిపోయిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాధిత బాలిక కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారన్నారు. బాధితులను పరామర్శించడం, ధైర్యం చెప్పడం లాంటివి చేయకూడదని బీఎస్ఎస్ చట్టంలో ఉందా అని ప్రశ్నించారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన వారిపై కేసులు పెట్టి వేధించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. బాలిక తండ్రిని సైతం ప్రలోభాలకు గురి చేసి తప్పుడు ఫిర్యాదులు చేయించిన తీరును ఎండగట్టారు. ఇలాంటి కేసులు న్యాయస్థానాల్లో నిలబడవన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నగర కార్యదర్శి ధర్నాశి హరిబాబు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా చట్టానికి అనుగుణంగా పనిచేస్తే ప్రజలు సంతోషిస్తారని, కక్షపూరిత విధానాలను తిరస్కరిస్తారని చెప్పారు. అధికార పక్షానికి ఒక రూలు, ప్రతి పక్షానికి మరొక రూలు అమలు చేయడం భావ్యం కాదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి మీద అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మనవరాలి వయసున్న బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తే కేసులు పెట్టడమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో నగర కార్యదర్శి కఠారి శంకర్, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఫణిదపు సుధాకర్, బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కటారి ప్రసాద్, మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు షేక్ మీరావలి, 14వ డివిజన్ అధ్యక్షుడు చావలి శివ, పార్టీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన కోటి యాదవ్ , వైయస్సార్‌సిపి మహిళా నాయకురాలు భూమిరెడ్డి రవణమ్మ , సీనియర్ నాయకులు పి.వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలి

- 18 ఏళ్లు వయసు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలి
- ఓటర్ల జాబితా పరిశీలకురాలు సూర్యకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకురాలు సూర్యకుమారి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు అర్బన్:** ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా పరిశీలకురాలు ఏ సూర్యకుమారి స్పష్టం చేసారు. ప్రకాశంభవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఎస్ఎస్ఆర్–2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం ఓటర్ల జాబితా పరిశీలకురాలు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమన్నారు. అటువంటి జాబితా రూపకల్పనలో ఎటువంటి తప్పులకు తావు లేకుండా స్వచ్ఛమైన జాబితా రూపొందించాలన్నారు. జిల్లాలో 18 నుంచి 20 ఏళ్ల వయసున్న యువతను తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటరు నమోదు ఫారాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు ఉంటే వాటిని సవరించాలన్నారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటరుకార్డుకు ఆధార్ మ్యాపింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ సమయంలో అన్ని అంశాల్లోని వ్యత్యాసాలను పరిశీలించాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు.

కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, 8 మంది ఈఆర్‌ఓలు ఉన్నట్లు వివరించారు. ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబర్ 29 నాటికి 18,19,566 మంది ఓటర్లుగా నమోదు అయినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 2183 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. 2025 ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ ప్రకారం ఓటరు నమోదు ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు. నూరుశాతం ఓటరుకు ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదీత్ వెంకట్రివినాగ్, డీఆర్‌ఓ ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్, వెంకట శివ రామిరెడ్డి, వెంకటసత్యనారాయణ, ఏఈఆర్‌ఓలు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, రాజశేఖర్, సత్యం, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవాలయ కమిటీ రాజీనామాకు
# ప్రభుత్వం ఆమోదం

**మార్కాపురం టౌన్:** చెన్నకేశవస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌తో పాటు సభ్యుల రాజీనామాను ఆమోదిస్తూ దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా పి. కేశవరావు, సభ్యులుగా ఉన్న జి.హరిహరరావు, సురేంద్ర, జి. విజయలక్ష్మి, సాధం వీరయ్య, పిన్నిక లక్ష్మీ, సురభి లక్ష్మీదేవీ, కందుకూరి సుబ్బమ్మ, కూరాటి మహాలక్ష్మిల రాజీనామాను ఆమోదించారు. ప్రస్తుత ప్రభుత్వంలో నూతన కమిటీని నియమించాల్సి ఉంది.

# పడగ విప్పిన ర్యాగింగ్ భూతం

**యర్రగొండపాలెం:** స్థానిక కళాశాలల వద్ద ర్యాగింగ్ పెచ్చరిల్లిపోతుంది. దీంతో విద్యార్థుల మధ్య తరుచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. బుధవారం ఈ ఘర్షణ తారాస్థాయికి చేరింది. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం రోడ్డులో ఉన్న రెండు కళాశాలలకు చెందిన విద్యార్థులు టీడీపీ కార్యాలయాన్ని వేదికగా చేసుకొని ఘర్షణకు దిగారు. ప్రైవేట్ కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థులు ఆ కార్యాలయం పరిసరాల్లో సంచరిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులను వేధింపులకు గురిచేశారు. వాళ్లు చెప్పినట్లు వినకపోతే మూకుమ్మడిగా దాడులకు పాల్పడ్డారు. కొంతమంది విద్యార్థులు మద్యం మత్తులో తమ ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఆ కార్యాలయం ప్రాంతం రణరంగాన్ని తలపించింది. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్య సంఘటన స్థలానికి చేరి విద్యార్థులను చెదరకొట్టారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విద్యార్థులను హెచ్చరిస్తున్న సీఐ ప్రభాకరరావు

# 1న శ్రీశైలంలో మెగా మెడికల్ క్యాంపు

**మార్కాపురం:** శ్రీశైలం యాదవ సత్రం ఆవరణలో డిసెంబర్ ఒకటో తేదీన ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు జాతీయ యాదవ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరానికి హైదరాబాద్, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, మార్కాపురం ప్రాంతాల నుంచి 15 మంది స్పెషలిస్టు వైద్యులు హాజరై సేవలందిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. పుట్టు మూగ పిల్లలకు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక వైద్యం చేయించేందుకు సహకరిస్తామని చెప్పారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చక్రపాణి, బీసీ సంఘ నాయకులు జీవీ సుబ్బారావు, చెంచయ్య, చేతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఎల్‌పీ యాదవ్

# పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలంలో బోల్తా పడిన కారు



చికిత్స పొందుతున్న లక్ష్మి



నారాయణ

**కంభం:** కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం రాత్రి కంభం సమీపంలో హైవేపై చోటుచేసుకుంది. వివరాలు.. బేస్తవారిపేట మండలం పెద్దఓబినేనిపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం కారులో అర్ధవీడు మండలంలోని రంగాపురంలో బంధువు పెద్దకర్మకు వెళ్లి వస్తున్నారు. స్థానిక సీఎల్‌ఆర్ కళాశాల సమీపంలో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో లక్ష్మి, నవ్య, బొల్లిపోయిన నారాయణకు తీవ్ర, మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అరటి లోడుతో ఎదురుగా దూసుకొచ్చిన ట్రక్‌ను తప్పించబోయి కారు అదుపు తప్పినట్లు క్షతగాత్రులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



వైద్యశాలలో క్షతగాత్రులు





# ఉల్లీ.. దిగిరావే తల్లీ!

**కోయకుండానే కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి**

**కనిగిరి రూరల్:** నిత్యావసర సరుకుల ధరలు కళ్లెం లేని గుర్రంలా దౌడు తీస్తుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తారెత్తిపోతున్నారు. మరోవైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చోవడంతో సగటు వేతన జీవులు సైతం అల్లాడిపోతున్నారు. బియ్యం, వంట నూనెలతోపాటు ఉప్పు, పప్పు ధరలు దిగిరాకపోవడంతో పేదలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ఉల్లిపాయ కోస్తే కన్నీళ్లు వస్తాయి. కానీ కూటమి ప్రభుత్వంలో ఉల్లిపాయ కోయకుండానే ధరలు కన్నీరు తెప్పిస్తున్నాయి! దాదాపు అన్ని ఆహార పదార్థాల్లో వినియోగించే ఉల్లిపాయలను ప్రస్తుతం బంగారంలా చూసుకునే పరిస్థితి దాపురించింది. నాలుగు నెలల క్రితం కేజీ రూ.30 నుంచి రూ.35 వరకు పలికిన ఉల్లిపాయలను ప్రస్తుతం మార్కెట్‌లో రూ.65 నుంచి రూ.70కు విక్రయిస్తున్నారు. ఉల్లి దిగుమతి తగ్గిందని సాకులు చెబుతున్న విక్రయదారులు, ధరలను మరింత పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. పెరుగుతున్న ఉల్లి ధరల ప్రభావం హోటల్స్‌పైనా పడింది. కూరల్లో ఉల్లికి బదులు క్యాబేజీని వినియోగిస్తుండటం గమనార్హం. ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతుండటంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. నిత్యవసర ధరలను అదుపులోకి తేవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని మహిళలు మండిపడుతున్నారు.

**అన్ని వర్గాలకూ ధరా భారం**

కార్తీక మాసంతో పాటు, వివిధ శుభకార్యాలకు ఉల్లి ధర భారంగా మారింది. పవిత్ర కార్తీక మాసంలో కూరగాలయపైనే ఎక్కువగా ఆధాపడి వంటకాలు చేస్తారు. పెరిగిన కూరగాయలు, ఉల్లి ధరలతో అన్ని వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. ఉల్లి ధర పెరిగినందున హోటళ్లలో తినుబండారాల రేట్లు పెంచి విక్రయాలు చేస్తున్నారు.

**ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం**



కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. కూటమి సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి ధరలు విపరీతంగా పెరిగాయి. ఉల్లిపాయల ధర కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు వంటకాల్లో ఉల్లిపాయలు వేసుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలను నియంత్రించాలి.

– జి.గాయత్రి దేవి,
ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యదర్శి

## బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి



ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, పక్కన కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు అర్బన్:** బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, కష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ సూర్యకుమారి అన్నారు. భారత ప్రభుత్వ మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని న్యూఢిల్లీ నుంచి లాంఛనంగా ప్రారంభించారు. వెబ్‌కాస్ట్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం భవనం నుంచి సూర్యకుమారితో పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బందితో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి, వికలాంగు సంక్షేమ శాఖ ఏడీ అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.